

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

– పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్ధం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

"శాంతి..." అంది ఏదో అడగబోయినా, పెదవులు తడబడి పోయాయి. గుండె ఎందుకో అపరిమితమైన వేగంతో కొట్టుకొంటోంది.

"శాంతిని ప్రేమించలేదా అని అడుగుతున్నావా? ఇక్కడికి వచ్చేవరకూ శాంతినే పెళ్ళాడదామనుకుని వచ్చాను. ఆ రోజు నువ్వు మా శాంతి కోసం వచ్చిన రోజు... మొదటిసారిగా నిన్ను చూసిన క్షణంలో అనుకున్నాను. నా కాబోయే శ్రీమతి శాంతి కాదు... యిలా పెద్ద పెద్ద కళ్ళు, ఆ కళ్ళలో ముగ్ధత్వం నిండివున్న కమల అని! రోజూ నీ కోసం ఎదురు చూడటమే! శాంతితో సినిమాలకి షికార్లకి తిరుగుతున్నానన్న మాటే గానీ మనసూ కళ్ళూ నీ కోసం గాలించని క్షణం లేదు. నిన్ను పెళ్ళాడతాను కమలా! నీకిష్టమేనా?" సుధీర్ ఓ విధమైన ఉద్వేగంతో అన్నాడు.

నిర్ఘాంత పోయింది కమల క్షణ కాలం. ఏ జవాబు చెప్పాలో తోచలేదు తను కలగంటుందో, నిజంగా సుధీర్ ఇలా అంటున్నాడో ఏదీ ఇదమిత్థంగా తేలటం లేదు.

"శాంతి వాళ్ళమ్మా, నాన్నగారు..."

సుధీర్ పెద్దగా నవ్వాడు. "అత్త, మామయ్యా ఏమనుకుంటారోనని, ఏమంటారోనని భయమా? అనటానికీ, అనుకోవటానికీ యిందులో యేముందీ? నేను నిన్ను ప్రేమించాను. పెళ్లాడతాను. నీ అంగీకారం తీసుకున్నాక వాళ్ళతో ఆ మాట చెబుతాను."

"మరి శాంతి?"

"శాంతికేం? లక్షాదికార్ల బిడ్డ! ఎల్లుండీ పాటికి ఆమెకు నన్ను మించిన వరుణ్ణి తెచ్చి పెళ్లి చేస్తారు."

ఇక కమలకేం అడగాలనిపించలేదు. 'శాంతి కూడా మిమ్మల్ని ప్రేమించిందేమో? అది మీరే తన కాబోయే భర్త అని నిర్ణయించుకుందేమో? దాని ప్రేమకి నేను అడ్డు తగులుతున్ననేమో? మీ అంతస్తుకి నేను తగనేమో? మీరు శాంతిని మోసగిస్తున్నారేమో?' ఇలాంటి ప్రశ్నలు మనసు అట్టడుగు పొరల్లో క్షణకాలం తలెత్తినా, వాటిని పయికి రానివ్వదల్చుకోలేదు. ఈ అదృష్టం అపురూపమైనది. ఈ అవకాశం అత్యద్భుతమయినది. జార విడుచుకుంటే, లేనిపోని కుశంకలతో తర్కానికి దిగితే మరి రాదేమో?

"ఏం కమలా? నీకిష్టమేనా? నీకు ఇష్టమైనా కాకున్నా నేను నిన్ను పెళ్ళాడేస్తాను. ఆఁ!" అన్నాడు సుధీర్ జబర్దస్తీగా కమల చుట్టూరా చేతులు వేస్తూ,

కమల సిగ్గుగా నవ్వింది. ఆ నవ్వులోనే ఆమె నేర్పుగా తన అంగీకారాన్ని తెలిపింది.

"ఆల్ రైట్! ఈ అవకాశం రాదేమో. బాంబే వెళ్లి నీకు ఉత్తరం వ్రాద్దామనుకున్నాను. వెళ్లి ఉత్తరం కూడా వ్రాస్తాను."

బాగా చీకటి పడ్డాక గానీ కమలకు తను కాలేజీ నుంచి ఇంటికి వెళ్ళలేదన్న నిజం గుర్తుకు రాలేదు. అందాకా వాళ్ళిద్దరూ ఏం కబుర్లు చెప్పుకున్నారో మూడు గంటల టైం ఎలా ఇట్టే గడిచి పోయిందో ఆ క్రీపర్సుకు మాత్రమే తెలుసు.

వారం రోజులు కమల కలల్లో మనిషికి మల్లే వుంది. యాంత్రికంగా కాలేజీకి వెడుతోంది, వస్తోంది. కానీ ఆమె మనసంతా సుధీర్ తనకి రాస్తానన్న ఉత్తరం మీదే లగ్నమయి వుంది. ఆ ఉత్తరంలో ఏం రాస్తాడో? ఎన్ని తీయని కబుర్లు రాస్తాడో, అవి నాన్నకి తెలపటం ఎలా? ఆ ఉత్తరం చూపటం ఎలా? పోనీ నాన్నకి నేరుగా 'ఇలా మీ కమలను నేను

పెళ్లాడతాను. ముహూర్తం పెట్టించండి" అని వ్రాయొచ్చుగా? ఊహుం! అలా వ్రాయడట. తనకే రాస్తానన్నాడు. "నువ్వే మీ నాన్నకా ఉత్తరం చూపించు" అన్నాడు.

శాంతి కాలేజీకి వస్తోంది. సుధీర్ వెళ్ళిపోయాక శాంతి యింత క్రితంలా చలాకీగా వుండటం లేదు, ఏదో కోల్పోయిన దానిలా చైతన్యమంతా ఎవరో లాగి వేసినట్లు యాంత్రికంగా నడుస్తున్న దానిలా ఉంటోంది. పాఠాలలో చురుకుదనం తగ్గి పోయింది. స్పోర్ట్స్ లో అసలు పాల్గొనటం లేదు. ఇది స్నేహితురాళ్ళంతా గమనించారు.

"తొందరలో పెళ్లి కాబోతోంది కదా! బహుశా ఆ తాలూకు ఆలోచనలేమో?" అని ఒకరిద్దరు చనువున్న స్నేహితురాళ్ళు సరదాగా అన్నారు. శాంతి చిరునవ్వు నవ్వి వూరుకుంది.

కానీ శాంతిలో కమల పట్ల ఇంతక్రితం వున్న అభిమానం మాత్రం తగ్గి పోయింది. ఆ విషయం కమలతో బాటు ఇతర స్నేహితురాళ్ళూ గుర్తించారు. ఇంతక్రితం కాలేజికి వస్తూ, సాధారణంగా కమలనీ కార్లో ఎక్కించుకు వచ్చేది. కాలేజి నుంచి వెళ్తూ కమలని కార్లో ఇంటివద్ద డ్రాప్ చేసి వెళ్ళేది. అలాగే కమలే శాంతి, శాంతే కమల అన్నట్లుండేవారు.

కానీ ఇప్పుడలా కాదు. కమలను చూడగానే శాంతి ఏదో పని వున్నట్లు తప్పుకు పోతుంది. శాంతిని చూడగానే కమల కూడా ముఖం చాటు చేస్తుంది, ఒకే సీట్లో కూర్చుంటుండిన ఇద్దరూ, ఒకరు ఫ్రంటు బెంచీలో, మరొకరు ఆఖరు బెంచీలో కూర్చుంటున్నారు. కారులో అసలు కమలని తీసుకు రావటం గానీ, ఇంటి దగ్గర డ్రాప్ చేయటం గానీ లేనేలేదు.

"నువ్వూ కమలా మాటా మాటా అనుకున్నారా? ఎందుకలా ముభావంగా వున్నారు?" అని ఒకరిద్దరు స్నేహితురాళ్ళు అడిగారు. శాంతి, "అబ్బే లేదే!" అంది నవ్వుతూ. ఆ పూట కమలతో కావాలని మాట్లాడింది నాలుగు పొడిమాటలు.

"శాంతితో నాకు తగవు ఏముంది?" అని తేల్చేసింది కమల.

కానీ పదో రోజు కాబోలు. శాంతి మెల్లిగా అడిగింది "కమలా! మా బావ వూరికెళ్ళేముందు రోజు నువ్వూ, బావా మా బంగాళా దగ్గరున్న పార్కులో కూర్చున్నారటగా?"

కమల షాక్ తిన్నట్లయింది. శాంతికెలా తెలిసింది? బహుశా సుధీర్ రావటం చూచిన తోటమాలి చెప్పి ఉంటాడా?

"ఛ.. ఛ... ఎవరన్నారా మాట?" అంది తనలోని కంగారు కప్పి పుచ్చుకుంటూ.

"పార్కులోని మొక్కలూ, పూలూ" అంది శాంతి నిశితంగా కమల కళ్ళల్లోకి చూస్తూ.

"ఛ... ఉత్త మాటలు!" అంది కమల మళ్ళీ.

“పోనీలే. ఉత్త మాటలో ... గట్టి  మాటలో. నువ్వా రోజు కాలేజీలో ఒళ్ళు బాగాలేదని చెప్పి, వచ్చేశావు కదా? అదీ ఉత్తి మాటేనా?”

కమల గతుక్కు మంది. శాంతి అన్ని వివరాలు లాగిందా? సుధీర్ తనని ప్రేమిస్తున్నాడని తెలుసుకుని జెలసీగా ఉందా?

“ఆ!  తలనొప్పిగా వుంటే ఇంటికొచ్చేశాను” అని ఏదో అర్జంటు పని వున్నదానిలా దూరంగా వెళ్తున్న సరోజను పిలుస్తూ గబగబా వెళ్లి పోయింది కమల.

ఇంటికొచ్చాక కమల చాలా చిరాకు ఫీలైంది. శాంతికీ, వాళ్ళమ్మా, నాన్నగార్లకీ అందరికీ తెలిసి పోయిందా? సుధీరే చెప్పి వెళ్ళాడా? మరి సుధీర్ నుంచి తనకి వస్తుందన్న ఉత్తరం రాలేదేం? అసలు రాస్తాడా? మర్చి పోయాడా?

శాంతి ఈర్ష్య పడుతోందా? పడనీ! సుధీర్ ఉత్తరం వ్రాసి, తమ పెళ్లి కుదిరిననాడైనా శాంతికి తెలియాలి కదా! ఎవరి అదృష్టం వాళ్ళది. సుధీర్ తనంత తానుగా ప్రేమిస్తున్నానని  చెప్పాడు కదా.

ఆ రోజు రాత్రి భోజనాలు అయ్యాక, తల్లి ఇంట్లో పని చూచుకుంటుండగా తండ్రి శ్రీహరిరావుగారు మెల్లిగా పిలిచారు.

“అమ్మా కమలా! అలా కాస్సేపు వాక్ కు వెళ్ళొద్దాం. వస్తావా?”

కమల ఆశ్చర్యంగా చూసింది తండ్రి వేపు. రాత్రి భోజనం అయ్యాక కాస్సేపు అలా బయట నడిచి వస్తాడు రోజూ ఆయనగారు. అది  ఆయనగారి దినచర్యలో ఓ భాగం. కానీ ఇన్నేళ్ళలోనూ ఎప్పుడూ ఏ కూతుర్ని గానీ, భార్యను గానీ వెంటబెట్టుకు వెళ్ళిన సందర్భాలు లేవు.

“రామ్మా!” ఈసారి ఆయనగారి పిలుపులో ఆజ్ఞ వుంది.

“వెళ్లి రా నాన్న వెంట” అంది శ్రీలక్ష్మి.

కమలక్కాస్త అర్థమైంది. నాన్న ఏదో తీవ్రంగా చెప్పదల్చుకున్నారు, ఇంటిక్కాస్త దూరంగా వుంటే బావుంటుందని అనిపించింది ఆయనగారికి. సరే... విందాం.

ఇద్దరూ రంగనాయకస్వామి ఆలయం దాటి, పెన్నా ఒడ్డుకు నడిచారు. పిండారబోసినట్లున్న వెన్నెల. అక్కడక్కడ నీళ్ళతో, నీళ్ళ మధ్య వున్న యిసుక తెరలతో... పినాకిని వెన్నెలలో మెరిసిపోతోంది.

ఇసుకలో ఓ చోట కూర్చున్నాక, శ్రీహరిరావుగారు ఆట్టే ఉపోద్ఘాతం లేకుండానే మొదలెట్టారు.

“సుధీర్ నీకు ఉత్తరం వ్రాశాడమ్మా. మధ్యాహ్నం పోస్ట్ లో ఆ కవరు వచ్చింది. ఇతరుల ఉత్తరాలు చదవకూడదన్న సంగతి నాకు తెలుసు. కానీ నా కన్నకూతురి మంచి కోరే బాధ్యత గల తండ్రిగా నాకున్న నమ్మకంతో విప్పి చదివాను.” ఆయనా మాటలు చెబుతూ కూతురు కేసి చూడటం లేదు. పెన్నా నదికేసి చూస్తున్నారు.

కమలకు గుండె దడదడలాడటం మొదలెట్టింది. అనుకున్నది జరుగుతుందేమోనని ఊహించడం వేరు. జరిగినప్పుడు ఎదుర్కోగలగటం వేరు. సుధీర్ ఏం వ్రాసి వుంటాడు? పిచ్చిగా ప్రేమ కబుర్లు... ఆ రోజు పార్కులో క్రీపర్స్ మాటున చెప్పినట్లే వ్రాసి ఉంటాడా? ఛ ఛ... అవన్నీ నాన్న చదివారా?

లేక సింపుల్ గా ‘నిన్ను పెళ్ళాడతాను’ అని వ్రాసి వుంటాడా? నాన్నేం చెబుతారో? ఎలా వినటం? అసలీ నాన్నెందుకు ఆ కవరు చింపి చదవాలి? తనకిస్తే తనే చదువుకొని, చెప్పవలసినంత వరకే చెప్పేది కదా.

“సుధీర్ నిన్ను పెళ్లాడతానన్నాడు.” శ్రీహరిరావుగారి గొంతు ఖంగుమంది.

కమల మాట్లాడలేక పోయింది,

“కానీ అటు వాళ్ళ అమ్మా నాన్నలు గానీ, ఇటు అత్తమామలు గానీ ససేమిరా అంటున్నారట. యిక వాళ్ళందరితో సంబంధ బాంధవ్యాలు తెంపుకోవటానికి పెద్ద యుద్ధమే చేయవలసి ఉంటుందిట. అది చేయటానికి తను సిద్ధంగానే వున్నాడట. కానీ, తన మామతో కొన్ని వ్యాపార సంబంధమైన లావా దేవీలూ, షేర్లూ వగైరాలు కొన్ని వున్నాయట. అవన్నీ ఓ రకంగా సెటిల్ చేసుకోవటానికి కనీసం ఒక్క సంవత్సరమైనా పదుతుందిట. అందాకా నువ్వు ఓపిక పడితే నిన్ను పెళ్ళాడుతాడట.” శ్రీహరిరావుగారు తను చెప్పవలసింది చెప్పేసినట్లు నిట్టూర్చారు.

“సంవత్సరం ఆగితే సరిపోలా నాన్నా.” కమల గబుక్కున అంది. ఇందాకటి గుండెదడ తగ్గింది కాస్త.

శ్రీహరిరావుగారు కూతురి వేపొకసారి నిశితంగా చూశారు. ఆ చూపు బాగా గమనించలేదు గానీ కమల గమనించి వుంటే ‘ఎంత పిచ్చిపిల్లవమ్మా’ అనే జాలి ఆ చూపుల నిండుగా వుందని అర్ధమయ్యేది.

“సంవత్సరం ఆగటం అన్నది ఒక సాకు మాత్రమే కమలా.”

“లేదు నాన్నా! సుధీర్ నన్ను తప్పక పెళ్ళాడుతాడు. సంవత్సరం లోగా వాళ్ళ మామతో, తలి తండ్రులతో అన్ని రకాల తెగతెంపులు చేసుకుంటాడు. లేదూ వాళ్ళందర్నీ ఒప్పిస్తాడు. ఈ లోగా నేను డిగ్రీ కోర్సులో చేరి చదువుకుంటాను.”

శ్రీహరిరావుగారికి నవ్వూ, జాలీ ముంచుకు వచ్చాయి. ఆరవ తరగతిలో చేరిన విద్యార్థి మెట్రిక్ పాసయ్యే లోగా వాడిలో శారీరకంగా, మానసికంగా, విజ్ఞాన పరంగా ఎన్ని ఎత్తు పల్లాలను ఎదుర్కోవాలో తను ఓ మాస్తారిగా ఎందఱో విద్యార్థులను చూసాడు. చదువులో అద్భుతంగా పైకి వచ్చే విద్యార్థి హఠాత్తుగా చదువు ఆపివేసి, కుటుంబ పోషణ భారం వహించవలసి వచ్చే పరిస్థితులు రావచ్చు. చదువులో మొద్దబ్బాయి అయినవాడు డొనేషన్లతో డాక్టరుగా మారి వెలిగిపోనూ వచ్చు. పెళ్ళిళ్ళ విషయమూ, ఈ తాత్కాలికావేశాల ప్రేమల విషయమూ అంతే! అందులోనూ కలవని అంతస్తుల ప్రేమలకూ, ఏ క్షణానికాక్షణం దినదిన గండం నూరేళ్ళాయుష్షు.

"చూడమ్మా! సుధీర్ నీ కోసం ఇంతటి త్యాగాలు చేయగలడని నీకు నమ్మకం ఉందేమో గానీ, నాకు లేదు. బంధుత్వాలు వదిలించు కోవటం, డబ్బు పరమైన లావాదేవీలు వదులుకోవటం నువ్వూహించినంత తేలిక కాదు."

తండ్రి మాటలు మధ్యలో ఉండగానే కమల ఆవేశంగా అంది.

"మీరలా నిరుత్సాహ పరచకండి నాన్నా! ప్రేమ ముందు అన్నీ తేలికే."

క్షణ కాలం నిర్ఘాంత పోయినట్లయి తనను తాను సర్దుకుని అన్నారాయన.

"నువ్వు డిగ్రీ కోర్సులో చేరి చదువుతూ ఉండటమే నే కోరేది. డిగ్రీ తెచ్చుకున్నాక నీకు పెళ్లి చేసి, నీ కాళ్ళ మీద నీవు నిలబడ గలిగే ఆత్మవిశ్వాసం నీకు కల్పిద్దామనే నేననుకున్నాను. కానీ ఈ సుధీర్ ప్రేమ వ్యవవహారం చూస్తోంటే నీకసలు చదివే చదువు  మీద దృష్టి లేదని రుజువయి పోయింది. నా ఆలోచనలన్నీ వ్యర్థమైనవని తేలి పోయింది. కానీ ఒకటి మాత్రం నిజం కమలా! శాంతి సుధీర్ ను పెళ్లాడటానికి హక్కూ, అంతస్తూ గలిగిన అమ్మాయి. నీకవి రెండూ లేవు. గుర్తుంచుకో."

"శాంతికి ఎన్ని హక్కులున్నా, అంతస్తులున్నా నాన్నా! సుధీర్ నన్నే కోరి, పెళ్లాడతానన్నపుడు ఆ పిల్ల ఎవరు ఆపటానికి?"

శ్రీహరిరావు లేచి నిల్చున్నారు. కమల అనుసరించింది.

రంగనాయకస్వామి ఆలయం ముఖద్వారం దగ్గరకు రాగానే శ్రీహరిరావుగారు చెప్పులు విడిచి, ఆలయానికి అభిముఖంగా తిరిగి చేతులు జోడించారు. "చూడమ్మా కమలా! శ్రీరంగశాయి ఎవరికి నిర్దేశం అయిన పాత్రలని, జీవితాలని వారికి నిర్దేశించాడు. మనకున్నదానిలో మనం తృప్తి పడటంలో గల ఆనందం, ఎదుటివారి సొమ్ము దోచుకుని అనుభవించటంలో ఏ నాడూ పొందలేరు. అలా జరిగిన నాడు పొందేది తాత్కాలికానందం. ఆ తర్వాత శాశ్వత దుఃఖం. నీకు చదువు మీద దృష్టి పోయింది. అది నేను గ్రహించాను. త్వరలో మనకి తగిన సంబంధం చూచి పెళ్లి చేసి పంపేస్తాను.

ఈ జీవితానికి నీ బాధ్యత కూడా తీరినట్లవుతుంది. నేనూ మీ అమ్మా శేష జీవితం నిశ్చింతగా రంగనాధుని సేవలో గడిపి వేస్తాము.” చిన్న స్వరంతో చెప్పారాయన.

“ఒద్దు నాన్నా. మీరు సంబంధాలు చూడనవసరం లేదు సంవత్సరం ఆగితే సుధీరే పెళ్లాడతా నన్నాడు కదా?’

ఇక శ్రీహరిరావుగారేం మాట్లాడలేదు, మౌనంగా ఇంటికొచ్చారు.

ఇది జరిగిన వారం రోజులకు ఓ రోజు కాలేజీలో శాంతి చాలా ఉత్సాహంగా స్నేహితురాలందరి మధ్యా కబుర్లు చెబుతూ కనిపించింది. డబ్బున్న శాంతి చుట్టూరా చాలామంది స్నేహితురాళ్లుంటారు ఎప్పుడూ. ఏమిటో హడావుడి అనుకుంది కమల.

“కమలా! ఇలా రావోయ్” అంటూ పిలిచింది శాంతి.

ఈ మధ్య అసలు పేరు పెట్టి పిలవడం లేదు. ఆశ్చర్యంగా వెళ్ళింది కమల.

పెద్ద సైజులో చిన్న పుస్తకంలా నాలుగు పేజీలున్న శుభలేఖలు అందరి చేతులలోనూ వున్నాయి.

“నా పెళ్లి కమలా! తప్పక రావాలి సుమా.” శుభలేఖ యిస్తూ అంది శాంతి.

“కంగ్రాచ్యులేషన్స్!” అంటూనే శుభలేఖ చదివింది కమల. బంగారు అక్షరాలూ, శుభలేఖ సైజూ అన్నీ శాంతి అంతస్తును తెలపటం వో ఎత్తు అయితే, ఆ బంగారు అక్షరాలు శాంతి– సుధీర్ అని వ్రాసివున్నాయేమిటి?

“పెళ్ళికొడుకు సుధీరా?”లోపల అనుకోబోయిన మాట పైకి అనేసింది.

“ఔనోయ్! నీకు పరిచయం చేశాను చూడు. మా బావ సుధీర్. అతనే!” శాంతి ఒక్కో మాట వత్తి పలుకుతూ, పరిశీలనగా చూస్తూ అంది.

కమలకు భూమి గిర్రున తిరుగుతున్నట్లుంది. సుధీర్ తనని పెళ్లాడతానన్నాడు. ఉత్తరమూ వ్రాసాడు. మళ్ళీ వారం తిరక్కుండా ఇదేమిటి? సంవత్సరం ఆగమన్నాడు కదా తనని!

ఇది జోక్ కాదు కదా? చేటంత శుభలేఖ కళ్ళెదురుగా కనిపిస్తుంటే జోక్ ఎలా అవుతుంది? స్వయంగా శాంతి శుభలేఖలు పంచుతూ, పేరు పేరునా పెళ్ళికి రండంటూ పిలవటం జోక్ ఎలా వుతుంది? తననీ, “కమలా! నువ్వు తప్పక

రావాలి సుమా!” అని మరీ మరీ పిలచి, హేళన నిండిన చూపులు, గర్వం నిండిన చూపులు, గెలిచానన్న చూపులు చూడడం జోక్ ఎలా అవుతుంది?

“మా బావ నిన్న వచ్చాడు. ఇక పెళ్లి వారం రోజులే కదా వుంది? అందాకా ఇక్కడే ఉంటాడుట కూడాను” అంది శాంతి గొప్పగా కమలను మాత్రం ఉద్దేశించి.

కమల ఎలా ఇంటికి వచ్చిందో ఆమెకే తెలియదు. సుధీర్ వ్రాసిన ఉత్తరం తీసి పదిమార్లు చదువుకుంది.

హఠాత్తుగా ఆమె కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. ఈ ఉత్తరం... ఈ ఉత్తరం పట్టుకుని శాంతి వాళ్ళింటికి వెళ్లి, సుధీర్ ని పిలిచి ఎలా వ్రాశావిది? నాకెలా మాట ఇచ్చావ్? అని నిలవేస్తే? కేశవరావు బాబాయిగారు, మీనాక్షమ్మ పిన్నికీ ఇదంతా చెప్పి, “సుధీర్ నాకు మాటిచ్చాడు. ఈ పెళ్లి జరగటానికి వీల్లేదని” గొడవ చేస్తే? వాళ్ళందరూ సుధీరును చీవాట్లేసి, ఈ జరగబోతున్న శాంతి సుధీర్ ల పెళ్లి ఆపవచ్చు. సుధీర్ కూడా భయపడవచ్చు తనకి.

ఆవేశంగా శాంతి బంగాళాకు బయలేరింది కమల. శ్రీహరిరావు ఎదురయ్యారు.

“కమలా! శాంతి సుధీర్ ల పెళ్లి జరగబోతోందమ్మా” అన్నారు. ఆ మాటలలో హేళన వ్యంగ్యమూ లేదు. ‘ఇప్పుడైయినా కళ్ళు తెరుచుకుని, నీ కాళ్ళ కింది భూమిని చూస్తూ నడవటం నేర్చుకో’ అనే వాత్సల్య పూరిత మందలింపు మాత్రమే వుంది.ఁ

“ఆఁ! ” అంది కమల అన్యమనస్కంగా.

“ఇందాక నేను రోడ్డు మీద వస్తుంటే, కారులో వెళ్తూ కేశవరావుగారు కనిపించి చెప్పారు. మేమిద్దరం చిన్ననాటి స్నేహితులమే. కానీ జీవితాలలో స్థిరపడ్డాక ఆయన అంతస్తులో ఆయన, నా పరిధులలో నేనూ, మా మధ్య స్నేహాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నాం ఇందాకా” అన్నారాయన.

కమల ఇవేమీ వినే స్థితిలో లేదు.

కమల వెళ్లేసరికి సుధీర్, శాంతిలు మేడ మీద కేరమ్స్ ఆడుకుంటున్నారని చెప్పింది మీనాక్షమ్మ. కేశవరావుగారు హాల్లో సోఫాలో కూర్చుని వున్నారు. నౌకర్లు ఎవరూ ఇంట్లో లేరు. బహుశా బయట పనుల్లో వుండి వుంటారు.

“వచ్చావా అమ్మా కమలా! ఇందాక మీ నాన్న కనిపిస్తే చెప్పాను, నిన్నోసారి పంపమని. చెప్పాడల్లె వుంది. వచ్చేశావు. ఇలా కూర్చో” అన్నారాయనగారు తనకెదురుగా వున్నా మరో సోఫా కేసి చూపిస్తూ.

‘నాన్న చెప్పలేదు. ఆయన చెప్పేలోగా నేనే వచ్చేశాను.’ అందామనుకుని అనలేక పోయింది కమల.

"సుధీర్ నిన్ను పెళ్లాడతానని మాట ఇచ్చాడు గదా? ఉత్తరం కూడా రాశాడట గదా, సంవత్సరం ఆగమని. ఇవి సుధీరే చెప్పనవసరం లేకుండా, మేం అందరం గమనించాము. పోయినసారి నువ్వూ, సుధీర్ చనువుగా మసలటం చూచి. నిజానికి శాంతి పెళ్లి, పై ఏడాదే చేద్దామనుకున్నాం. కానీ పరిస్థితుల దృష్ట్యా ఇప్పుడే నిర్ణయించేశాం, మీ నాన్న మొన్ననొక రోజు చెప్పారు. "కమల చిన్నపిల్ల. ఆవేశం తప్ప ఆలోచన లేదు. నేను నచ్చ చెప్పాను. వీలైతే నా స్నేహితుడిగా, తండ్రి తర్వాత తండ్రిగా అదే వాత్సల్యంతో ఆ అమ్మాయికి చెప్పు' అన్నారు.

కమలా! మీ నాన్నలాటి స్నేహితుల్ని అరుదుగా చూస్తాం అమ్మా. స్నేహాన్ని స్వార్ధానికి వాడుకోని వ్యక్తులెవరేనా వుంటే, ఎక్కడో నూటికీ కోటికో మీ నాన్నలాటి వారొక్క రుంటారు." కేశవరావుగారు క్షణకాలం ఆగారు.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments